సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా

వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సం జరిగింది -8లో



నా దాతృత్వం చూసి టీడీపీ నేతలు భయపడుతున్నారు

తన దాతృత్వ హృదయాన్ని చూసి టీడీపీ నేతలు భయపడుతున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.-10లో

గరిష్ఠం/కనిష్ఠం
33.4/16.0

వాతావరణం

జిల్లాలో ఆదివారం 16.0 – 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

శనగ, మినుముల కొనుగోలుకు పేర్లు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా రబీ 2022–23 సీజన్‌లో సాగు చేసిన శనగ, మినుము పంటల సాగు చేసిన రైతులు తమ ఉత్పత్తులను మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్మ దలచిన రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి తాడిగొట్ల నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రైతు భరోసా కేంద్ర సిబ్బంది, ప్రొక్యూర్‌మెంట్ ఏజెన్సీలకు శనగ, మినుముల కొనుగోళ్లపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1.60 వేల ఎకరాల్లో శనగపంట సాగైందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధరకంటే బయట మార్కెట్‌లో తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం శనగ మద్దతు ధర క్వింటా 5,335, మినుములు క్వింటా 6600 నిర్ణయించిందన్నారు. శనగ సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 22 కొనుగోలు కేంద్రాల ద్వారా శనగ, మినుము పంటల కొనుగోలు చేయడానికి సహ్నహాలు చేశామని తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్లాస్టిక్ నిషేధం: కడప డీఎఫ్‌ఓ



శ్రీ నిత్యపూజ స్వామి సన్నిధిలో కడప డీఎఫ్‌ఓ వెంకట సందీప్‌రెడ్డి తదితరులు

సిద్దవటం: మహాశివరాత్రి ఉత్సవాల్లో శ్రీ నిత్యపూజ స్వామి కోనలో అన్నదాన కార్యక్రమాలకు ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్ల వాడకాన్ని నిషేధించాలని కడప డీఎఫ్‌ఓ వెంకట సందీప్‌రెడ్డి అటవీ .అధికారులకు ఆదేశించారు. సిద్దవటం మండలం లోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న లంకమల్ల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు.ఆలయ చైర్మన్ కొండారెడ్డి ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన లంకమల అడవుల్లో అటవీశాఖ చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని , ఆర్టీసీ బస్సులు నిలుపు స్థలాన్ని పరిశీలించారు. భక్తులకు స్వచ్ఛందంగా అన్న ప్రసాదాలు పెట్టేవారు విస్తర్లు ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. అనంతరం ఆయన సిద్దవటం రేంజి లోని కొండూరు బీటులోని కలివికోడి ఆవాస ప్రాంతమైన మచ్చాయకుంట ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ ప్రసాద్, డిప్యూటీ రేంజర్ ఓబులేస్, బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన టమాటా ధరలు

కడప అగ్రికల్చర్: టమాట ధరలు కొండ దిగుతున్నాయి. వారం క్రితం కిలో రూ. 25 ఉండగా ప్రస్తుతం కిలో రూ. 12 పలుకుతున్నాయి. కూరల్లో టమాటా నిత్యం వినియోగించాల్సి రావడంతో వీటి కొనుగోళ్లు మార్కెట్‌లో అధికంగా ఉంటున్నాయి.ఇప్పుడు ధర తగ్గడంతో వినియోగదారులకు కొంత ఉపశమనం లభించింది.

అన్నమయ్య జిల్లాలో వెలసిన రెడ్డెమ్మ కొండ ఆలయంలో భక్తులు మొక్కుబడిగా సమర్పించే తలనీలాలకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉంది. దాని ధర కూడా అదే స్థాయిలో ఉండటం విశేషం. తలనీలాలు సేకరించడంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇక్కడి నుంచి దిగుమతి చేసుకున్న వెంట్రుకలతో తయారు చేసిన తుది ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌లో భారీ ధరలకు చైనా విక్రయిస్తోంది.

ఆలయంలో అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

SAKSHI SPECIAL



చెర్లోపల్లెలో వెలసిన సంతానదేవత రెడ్డెమ్మతల్లి ఆలయం



• రెడ్డెమ్మ కొండ టు చైనా

సిరులొలికించే కురులు



- రెడ్డెమ్మ కొండ తలనీలాలు చైనా దేశానికి ఎగుమతి
- రికార్డు స్థాయిలో తల నీలాల వేలంపాట
- ఆలయ చరిత్రలో ఈ సారే అత్యధికం

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లాలో సంతాన దేవతగా ప్రసిద్ధి పొందిన రెడ్డెమ్మ తల్లి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి చైనాతో పాటు ఇతర దేశాలకు తలానీలాలను ఎగుమతి చేస్తుంటారు. గత ఏడాది అత్యధికంగా రూ. 26.24 లక్షలకు వేలం పాట పాడుకోగా ఈసారి ఆలయ చరిత్రలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో తల నీలాల వేలంపాట ధర రూ.27.01 లక్షలకు పాడుకోవడం గమనార్హం.

నాణ్యమైన తలనీలాలు

రాష్ట్రంలోని అన్ని దేవాలయాలతో పోల్చితే రెడ్డెమ్మకొండ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడి ఆలయానికి వచ్చే భక్తులంతా ముఖ్యంగా సంతానం కోసం వచ్చేవారే. అందరూ 22 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు ఉన్న మహిళలే. ఇక్కడి ఆలయ పరిసరాల్లో పంపిణీ చేసే ఆకు పసరును సేవించి అమ్మవారి ఎదుట వర పడితే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. కోర్కెలు తీరిన మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి భక్తితో తలనీలాలు సమర్పిస్తుంటారు. అందరూ మధ్య వయస్సులో ఉన్న వారు కావడంతో వారి తలనీలాలు ఎంతో నాణ్యమైనవిగా ఉంటాయనేది వ్యాపారుల నమ్మకం.

విదేశాలకు ఎగుమతి

ఈ ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలు ముఖ్యంగా చైనాతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. అన్ని దేవాలయాల్లో అన్ని వయస్సుల వారు స్వామి వార్లకు తలనీలాలు సమర్పిస్తుంటారు. అయితే ఇక్కడి ఆలయంలో ఎక్కువగా మహిళలు, యువకులు అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తుంటారు. దీంతో ఈ వయస్సు వారి తలనీలాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మిగిలిన ప్రాంతాల తలనీలాలతో పోల్చితే విదేశాల్లో రెడ్డెమ్మ కొండలోని తలనీలాలు ఎక్కువ ధర పలుకుతుంటాయి. దీంతో ఇక్కడి ఆలయంలోని తలనీలాలకు మంచి డిమాండ్ ఉంది.

కిలో తలనీలాలు రూ. 60 వేలు

ప్రస్తుతం తలనీలాలు కిలో ధర మార్కెట్లో రూ. 60వేలు వరకు పలుకుతోంది. గతంలో కిలో ధర రూ. 30 వేలు నుంచి రూ. 40వేల వరకు మాత్రమే ఉండేది. అయితే తలనీలాలకు మార్కెట్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా మన దేశంతో పాటు విదేశాల్లోనూ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో వ్యాపారులు ఎగబడి తలనీలాల వేలం పాటలో పాల్గొనడం విశేషం.

రికార్డు స్థాయిలో వేలం పాటలు

ఆలయ చరిత్రలో ఎన్నడూలేని విధంగా తలనీలాల వేలం పాటలు రికార్డు స్థాయిలో పలికాయి. వారం రోజుల క్రితం జరిగిన వేలం పాటలో బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున తరలి రావడంతో పోటీ బాగా పెరిగింది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, కర్నూలు, అనంతపురం, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు తరలివచ్చారు. ఎలాగైనా వేలం పాట దక్కించుకోవాలనే ఉద్దేశంతో రికార్డు స్థాయిలో రూ. 27.01 లక్షలకు వేలం పాట పాడుకొన్నారు. గతంలో రూ. 10 నుంచి రూ. 12లక్షలు మాత్రమే తలనీలాల వేలం పాటలు పాడేవారు. గత రెండేళ్లుగా వరుసగా రూ.26.34లక్షలు, ప్రస్తుతం రూ.27.01లక్షలు వేలం పాట పాడుకోవడం విశేషం. విదేశాల్లో రెడ్డెమ్మకొండ తలనీలాలకు ఉన్న డిమాండే దీనికి కారణమని వ్యాపారులు చర్చించుకుంటుండటం విశేషం.

అధిక మొత్తంలో పాడుకున్నారు



ఈ ఏడాది తలనీలాలు ఎక్కువ మొత్తంలో వేలం పాట పాడుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా వ్యాపారులు పోటీపడి వేలం పాటలో పాల్గొన్నారు. అమ్మవారి దయతో రికార్డు స్థాయిలో రూ. 27.01 లక్షలకు తలనీలాల కాంట్రాక్టు తీసుకొన్నారు. ఆలయ అభివృద్ధికి ఇది ఎంతో దోహద పడుతుంది. -మంజుల, రెడ్డెమ్మకొండ ఈఓ, చెర్లోపల్లె

తలనీలాలకు మంచి డిమాండ్



అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈమారు వేలం పాటలో నాలుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పాల్గొనడం ఇందుకు నిదర్శనం. మనదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా రెడ్డెమ్మకొండ తలనీలాలకు మంచి డిమాండ్ ఉంది. అందుకోసమే వ్యాపారులు పెద్ద మొత్తంలో వేలం పాటలు దక్కించుకొన్నారు.
– నరసింహారెడ్డి, ఆలయకమిటీ చైర్మన్, చెర్లోపల్లె

ప్రశాంతంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష



కడపలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి ఎ. ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్) ప్రశాంతంగా జరిగింది.కడప, పులివెందుల, బద్వేల్‌లో మూడేసి చొప్పున , జమ్మలమడుగులో నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం13 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 2358 మంది విద్యార్థులకుగాను 2271 మంది హాజరై 96 శాతంగా నమోదైంది. కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్, మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 9,10,11,12 తరగతులు చదివేందుకు సంవత్సరానికి రూ. 12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలపాటు రూ. 48 వేలు మెరిట్ స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. ప్రతి విద్యార్థి దీనిని సద్వినియోగం చేసుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్‌సూపరింటెండెంట్ నాగమణి, డిపార్ట్‌మెంటల్ స్క్వాడ్ విజయారెడ్డి పాల్గొన్నారు.

12 వరకు ఎన్‌ఎంఎంఎస్ అభ్యంతరాల స్వీకరణ

జిల్లావ్యాప్తంగా 5వ తేదీ నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు సంబంధించిన 'కీ'ని 6వ తేదీన విడుదల చేసి ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌సీ.ఏపీ.జీవోవి.ఇన్‌లో ఉంచుతారు ఈ విషయాన్ని డీఈఓ దేవరాజు తెలిపారు. ప్రాథమిక కీ విషయంలోని అభ్యంతరాలు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంబంధింత స్కూల్ లాగిన్‌లో గల గ్రీవెన్స్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు చెప్పారు. సరైన ఆధారాలు ఉన్న అభ్యంతరాలు మాత్రమే పరిశీలించనునన్నట్లు తెలిపారు.

ఆరోగ్య శ్రీ సేవలు అమోఘం



సెమినార్‌లో ప్రసంగిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

కడప రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలు అద్భుతంగా ఉన్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు.అసోసియేషన్ కడప శాఖ అధ్యక్షులు డాక్టర్ ఫరూక్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో ఇండియన్ మెడికల్ అసోషియేషన్ జోన్–3 స్టేట్ లీడర్స్ వర్క్‌షాప్ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రముఖ సంస్థల్లో ఐఎంఏ ఒకటని తెలిపారు. ఈ శాఖకు జాతీయంగా 1,750 బ్రాంచీలు ఉండగా అందులో 3.50 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో 100 శాఖలు ఉన్నాయని, అందులో 20 వేల మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఐఎంఏలో ప్రైవేట్ వైద్యులే కాదని ప్రభుత్వ రంగ వైద్యులు కూడా ఉన్నారని అన్నారు. ఈ సంస్థ వైద్యుల పరిరక్షణకే గాక ప్రజా రోగ్యానికి ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలు అమూల్యమైనవని తెలిపారు. ఈ పథకం ద్వారా ఎంతో మంది పేదలు పునర్జన్మ పొందుతున్నారనిన అన్నారు. నిబంధనల ప్రకారం 50 పడకల ఆసుత్రి అయితేనే ఆరోగ్య శ్రీ వర్తిస్తుందన్నారు. 25 పడకలు ఉన్నా కూడా ఆరోగ్య శ్రీని వర్తింప చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన నిబంధనలను సులభతరం చేయాలన్నారు. కాగా ఆపదలో వచ్చిన వారి ప్రాణాలను కాపాడలనేదే వైద్యుల ప్రయత్నమన్నారు. అనుకోని విధంగా పేషెంట్‌కు ఏదైనా జరిగితే వారి బంధువులు, వైద్యులు, ఆసుపత్రులపై దాడులు చేయడం తగదన్నారు. ఈ దాడులను అరికట్టడానికి 2008వ సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఈ చట్టంలో కొన్ని మార్పులు తేవాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం త్యాగరాజరెడ్డి, కడప శాఖ సెక్రటరీ డాక్టర్ వినమ్, సభ్యులు హేమలత, అశోక్, నాగమణి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కమ్యూనిటీ వలంటీర్లకు శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్ : ఆపద మిత్ర పథకం కింద ఎంపికైన కమ్యూనిటీ వలంటీర్లకు కడప నగరంలోని జెడ్పీ ఆవరణలో ఉన్న డీపీఆర్‌సీ భవనంలో సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ నిర్వహించే 12 రోజులు వసతి కూడా కల్పిస్తామన్నారు. వలంటీర్లు 12 రోజులు డీపీఆర్‌సీ భవనంలోనే ఉండేందుకు సిద్ధమై రావాలన్నారు. వలంటీర్లను గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో శిక్షణకు పంపాలని సంబంధిత ఎంపీడీఓలను ఆయన ఆదేశించారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: నవ్‌గురుకుల్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్, కోడింగ్‌లో నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణతోపాటు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నవ్ గురుకుల అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివి 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. సంవత్సర కాలంపాటు బెంగళూరులో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా సమయంలో ఉచిత భోజన, వసతితోపాటు లాప్‌టాప్ అందజేస్తామని తెలిపారు. వివిధ కోర్సుల్లో శిక్షణ అనంతరం ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉపాధి చూపుతామని ఆయన వివరించారు. నిరుద్యోగ యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 90004 87423నెంబరులో సంప్రదించాలన్నారు.

వైభవం.. సీతారాముల పౌర్ణమి కల్యాణం



కల్యాణ దంపతులైన సీతారాములు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదికపై అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం జరిపారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకులు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ పి.ఎస్. గిరీషా
- హోరాహోరీగా సాగిన కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్
- విజేతగా అన్నమయ్య జిల్లా ఎస్పీ జట్టు



టాస్ వేస్తున్న క్రికెట్ సంఘం అధ్యక్షుడు భరత్‌రెడ్డి. చిత్రంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు



బ్యాటింగ్ చేస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



బ్యాటింగ్ చేస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప స్పోర్ట్స్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయనిగ ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని నిండు నూరేళ్ల ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఈ క్రికెట్ పోటీలలో ఓడినవారు నిరుత్సాహానికి లోనుకాకుండా తదుపరి మ్యాచ్‌లలో గెలిచేలా శ్రమించాలని సూచించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి క్రికెట్ కిట్, యూనిఫాం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ కలెక్టరేట్ సిబ్బంది, ఎస్పీ కార్యాలయ సిబ్బంది మంచి స్పోర్టివ్‌గా క్రికెట్ మ్యాచ్ ఆడటం సంతోషంగా ఉందన్నారు. విధి నిర్వహణలో ఉన్నప్పటికీ మ్యాచ్‌లో మంచి ఆటతీరు కనబరిచారని అభినందించారు.

ఎస్పీ లెవన్ విజయం..

టాస్ గెలిచిన ఎస్పీ లెవన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. జట్టులోని పెంచల్య 66 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కలెక్టర్ లెవన్ 19.5 ఓవర్లలో 151 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కాగా జిల్లా కలెక్టర్, ఎస్పీ బ్యాటింగ్ చేసే సమయంలో సిబ్బంది ఎంతో ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా పెంచలయ్య, బెస్ట్ బౌలర్‌గా హేమంత్ రెడ్డి నిలిచారు. ఇన్‌స్పైరింగ్ ప్లేయర్‌గా కలెక్టర్ పి.ఎస్. గిరీష, బెస్ట్ కెప్టెన్‌గా ఎస్పీలకు ట్రోఫీలు అందజేశారు. విన్నర్స్ ట్రోఫీ ఎస్పీ లెవన్‌కు, రన్నర్స్ ట్రోఫీ కలెక్టర్ లెవన్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పెషల్‌ డ్రైవ్‌లో 232 కేసులు

కడప అర్బన్‌ : జిల్లా వ్యాప్తంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి వాహనాల స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 232 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్‌ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 206 కేసులు, సీటు బెల్ట్‌ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహనచోదకులపై 26 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ మాట్లాడుతూ హెల్మెట్‌, సీటు బెల్ట్‌ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పేర్కొన్నారు.

రెండు గడ్డి వాముల దగ్ధం

చక్రాయపేట : మండలంలోని గంగారపువాండ్లపల్లె గ్రామం ఎద్దులవాండ్లపల్లెలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు వేరుశనగ గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లోని ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో అది కాలుతూ వచ్చి గడ్డి వాములు అంటుకున్నాయని వైఎస్‌ఆర్‌సీపీ నేత మల్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో యుగంధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిలకు చెందిన వాములు కాలిపోయాయి. వాటి విలువ సుమారు రూ.80 వేలు పైనే ఉంటుంది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎనర్జీ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ జిల్లా కమిటీ ఎన్నిక


కృపాకర్‌


మునెయ్య

కడప కార్పొరేషన్‌ : గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా పరిషత్‌ ప్రాంగణంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు వారు చెప్పారు. అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడిగా వై.కృపాకర్‌, కార్యదర్శిగా మునెయ్య, కోశాధికారిగా వీ. శ్యామ్‌, ఉపాధ్యక్షులుగా వై. జయాకర్‌, బి. నాగభాస్కర్‌, ప్రహ్లాదరెడ్డి, పి. ఆనంద్‌, శరత్‌, రియాజ్‌ బాషా, సహాయ కార్యదర్శులుగా సుదర్శన్‌రెడ్డి, సి.చరణ్‌ కుమార్‌రెడ్డి, శరత్‌ కుమార్‌, కె. భార్గవ్‌రెడ్డి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చే స్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

కడప అర్బన్‌ : కడప నగరం చిన్నచౌక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని అంబేడ్కర్‌ సర్కిల్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. స్థానిక సింహపురి కాలనీలో నివాసం వుంటున్న ముత్తుకూరు రమాదేవి(55) తన కుమార్తె హిమజతో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలో వదిలి పెట్టడానికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె రోడ్డు దాటుతుండగా రాజంపేట వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని రిమ్స్‌ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

వైభవంగా శ్రీ విజయదుర్గమ్మ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్‌ : నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేకంగా నవకలశ స్నపనం నిర్వహించారు. పవిత్ర నదీ జలాలను నింపిన తొమ్మిది కలశాలు ధరించిన తొమ్మిది మంది దంపతులతో కలిసి ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్‌ ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఆ జలాలతో అమ్మవారి మూలమూర్తికి నవకలశ స్నపనం చేశారు. కనుల పండువగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ యాగ మండపంలో చండీ హోమాన్ని, శీ చక్ర మండపంలో నవావరణ శ్రీ చక్రార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు ఆధ్వర్యంలో 108 మంది ముత్తయిదువులు అష్టోత్తర శతదీపాలంకార సేవ నిర్వహించారు. రాత్రి శ్రీ విజయదుర్గ, మల్లికార్జునులను పులి వాహనంపై ఊరేగించారు.


నవావరణ శ్రీ చక్ర పూజలో భక్తులు


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

క్రీస్తు మార్గం.. లోకానికి అనుసరణీయం

కడప కల్చరల్‌ : ప్రభువైన ఏసుక్రీస్తు మార్గం లోకానికి అనుసరణీయమని, ఆయన మార్గదర్శకత్వంలో అందరికీ మంచి జరుగుతుందని మైదుకూరు విచారణ గురువులు ఫాదర్‌ సంబటూరు సురేష్‌ అన్నారు. కడప నగరం మరియాపురంలో లూర్దుమాత తిరునాల నాల్గవ రోజైన ఆదివారం ఆయన ఆధ్యాత్మిక వేదికపై ప్రధాన ప్రసంగం చేశారు. బైబిల్‌ గ్రంథంలో అనేక మంది ప్రవక్తలు, నీతివంతులతోపాటు మరియతల్లి కూడా దేవుడు చెప్పినట్లు చేసింది గనుకనే ఆమె ఆత్మ శరీరాలతో నేటికీ పరలోకంలో ఉందన్నారు. మనం కూడా దైవం చెప్పినట్లు చేస్తే మంచి జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా భాకరాపేట విచారణ గురువులు ఫాదర్‌ కుడంద్లై జోసెఫ్‌ లారెన్స్‌ దివ్య బలిపూజ సమర్పించారు. విచారణ గురువులు ఫాదర్‌ బిరుసురాజా, సహాయక గురువులు ఫాదర్‌ కె.చంద్ర పర్యవేక్షణలో తిరునాల కమిటీ అధ్యక్షులు వారాధి జోసెఫ్‌, ఉపాధ్యక్షులు పుల్లగుజ్జు విజయ్‌కుమార్‌, కార్యదర్శి పుల్లగూర లూర్దు, సహాయ కార్యదర్శి యన్నం ఆనంద్‌, కోశాధికారి యు.వి జయభాస్కర్‌ ఆధ్వర్యంలో తొలుత మరియాపురం పురవీధుల్లో విశ్వాసులు మరియమాత స్వరూపాన్ని పల్లకీలో ఉంచి ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు వచ్చారు. వివిధ విచారణ గురువులు, సిస్టర్లు స్తుతి గీతాలను ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో దండుపేట సంఘం ప్రధాన వేదికను కనుల పండువగా అలంకరించారు. స్తుతి గీతాలను ఆలపించారు.


ఆధ్యాత్మిక సందేశం అందజేస్తున్న మైదుకూరు విచారణ గురువులు ఫాదర్‌ సురేష్‌


లూర్దుమాత ప్రతిమను ఊరేగిస్తున్న విశ్వాసులు

గొప్ప వ్యక్తులకు శాశ్వత కీర్తి కల్పిద్దాం

రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో వక్తలు


రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతున్న లయన్‌ మానస కె.చిన్నపరెడ్డి

కడప కల్చరల్‌ : తమ జీవితాలను దేశం, ప్రజలు, సమాజం కోసం అంకితం చేసిన ధన్యుజీవులైన గొప్ప వ్యక్తులకు శాశ్వతకీర్తి కల్పించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని వక్తలు పేర్కొన్నారు. రాయలసీమ టూరిజం అండ్‌ కల్చరల్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎస్సార్‌ మెమోరియల్‌ ప్రెస్‌క్లబ్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుద్దా వెంగళరెడ్డి, యోగి వేమన విగ్రహాలను నగరంలో ఏర్పాటు చేసే అంశంపై రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కడప అన్నమయ్య పాస్ట్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ మానస కె.చిన్నపరెడ్డి కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తూ రాయలసీమకు గర్వకారణంగా నిలిచిన ముగ్గురు గొప్ప వ్యక్తుల కృషికి శాశ్వత కీర్తి కల్పించేందుకు విగ్రహాల ఏర్పాటు ఓ మార్గమని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తుల శౌర్య, దాన, సామాజిక చింతనలను భావి తరాలకు తెలియజేసేందుకు ఇది ఉత్తమమైన పద్ధతిగా భావిస్తున్నామన్నారు. వారి విగ్రహాల ఏర్పాటుకు అందరూ కలిసి రావాలని కోరారు. కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, బాలస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, 23వ డివిజన్‌ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి మాట్లాడుతూ నగరంలో ఆ ముగ్గురి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి కోసం కార్పొరేషన్‌ సమావేశం దృష్టికి తెస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ఇందుకు అవసరమైన కమిటీలను ఏర్పాటు చేసి పనులు సజావుగా సాగేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ వేమన విగ్రహం ఏర్పాటుకు కార్పొరేషన్‌ అనుమతి కూడా ఇచ్చిందన్నారు. ఆ తర్వాత అభ్యంతరాలతో పనులు ముందుకు సాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవత సంస్థ ప్రతినిధులు డాక్టర్‌ రామాంజులరెడ్డి, రాటాల గోపి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెంచురెడ్డి, కె.సురేష్‌బాబు మాట్లాడుతూ వై-జంక్షన్‌లో గానీ, రాజీవ్‌మార్గ్‌లో గానీ లేదా నగరంలోని ముఖ్య కూడళ్లలో వీలున్న చోట ఆ మహా పురుషుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కడప అన్నమయ్య అధ్యక్షుడు డాక్టర్‌ ఆర్‌.రంగనాథరెడ్డి, కోదండ రామస్వామి ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, భూపతిరాయల్‌, బాసట బాలాజీరావు, సుబ్బారెడ్డి మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు ఉత్తమ కార్యక్రమమని, వాటిని ఏర్పాటు చేసేందుకు అనువైన చోట్లను సూచించారు. వైవీయూ చిత్రకళా ఫ్యాకల్టీ మనోహర్‌ మాట్లాడుతూ విగ్రహాల తయారీలో యూనివర్సిటీ కళాకారుల సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ వీలైనంత త్వరలో కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టగలమన్నారు. 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్‌ తుమ్మలూరు సురేష్‌, కేవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎగువ భద్ర ప్రాజెక్టుతో సీమకు అన్యాయం


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఎర్రగుంట్ల : కేంద్ర బడ్జెట్‌లో కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న ఎగువ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించి ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం వల్ల రాయలసీమ రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని, ఈ ప్రాంతం ఏడారిగా మారుతుందని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, కె.ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎర్రగుంట్ల పట్టణంలోని మార్క్స్‌ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర నది మీదుగా డ్యామ్‌కు పైభాగంలో ఎగువ భద్ర అనే ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. దీని ఫలితంగా తుంగభద్ర డ్యామ్‌ నుంచి మొదటి దశలో 17.4 టీఎంసీలు, రెండవ దశలో 29.9 టీఎంసీలు నీటిని ఎగువ ప్రాంతానికి తరలించడం వల్ల.. తుంగభద్ర డ్యామ్‌కు దిగువ ప్రాంతంలో ఉన్న ఎల్‌ఎల్‌సీ, హెచ్‌ఎల్‌సీ, పోతిరెడ్డిపాడు, రాజోలు బండ డైవర్షన్‌ స్కీం ప్రాజెక్టులకు నీరు అందక రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందన్నారు. దిగువ ప్రాంతంలో దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టు నీరు అందక రైతులు నష్టపోతారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేందుకే కర్ణాటక రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించడం జరిగిందన్నారు. దీనిపై రైతు సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఆదోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భవాని శంకర్‌, ఏఐటీయూసీ నాయకులు రాధాక్రిష్ణ, ఓబుళరెడ్డి, ఏఐవైఎఫ్‌ నాయకులు పాల్గొన్నారు.

రామాస్‌ శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ ప్రారంభం


రామాస్‌ శ్రీకర ఆస్పత్రి అధునాతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప రూరల్‌ : ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి కడప నగరంలో పేరెన్నికగన్న రామాస్‌ శ్రీకర ఆస్పత్రి అధునాతన వైద్య సౌకర్యాలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మారింది. ఆదివారం స్థానిక నాగరాజుపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా ఈ నూతన ఆస్పత్రిని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు రామాస్‌ శ్రీకర హాస్పిటల్‌ ద్వారా జిల్లా వాసులకు విలువైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు మరింతగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో సొంత భవనంలో అన్ని హంగులతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఎండీ, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు రామాంజులరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మరింతగా మెరుగైన వైద్య సేవలు అందించాలని నూతన భవనంలో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. నగరమేయర్‌ సురేష్‌బాబు, ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్‌ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, ఆస్పత్రి వైద్యులు రాఘవేంద్ర, దీప్తి ప్రియాంక, వైద్యులు శ్రీకాంత్‌, వెంగల్‌రెడ్డి, శైలేంద్ర పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఏపీటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్‌


సమావేశంలో మాట్లాడుతున్న సీవీ ప్రసాద్‌

కడప ఎడ్యుకేషన్‌ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని ఏపీటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్‌ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ రద్దుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి స్పందన చేయకపోవడం విచారకమన్నారు. జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఏపీటీఎఫ్‌ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీఖాన్‌, చెంగల్‌రెడ్డి మాట్లాడారు. జిల్లా నాయకులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్‌, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ ఎదుట నిరసన

కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌ చేస్తూ కలెక్టరేట్‌ వద్ద కడపజిల్లా ఆధ్వర్యంలో సంకల్పదీక్షను చేపట్టారు. యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌ కుమార్‌, పాలెం మహేష్‌బాబు పాల్గొన్నారు.

శాప్‌ లీగ్‌ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు రెండో స్థానం

కడప స్పోర్ట్స్‌ : కాకినాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి శాప్‌ లీగ్‌-2 పోటీల్లో వైఎస్‌ఆర్‌ కడప జిల్లా జట్టు రెండోస్థానంలో నిలిచింది. జిల్లా జట్టు రెండోస్థానంలో నిలవడంపై స్టెప్‌ సీఈఓ సి. సాయిగ్రేస్‌, డీఎస్‌ఏ చీఫ్‌ కోచ్‌ ఎన్‌.వి.పి. అమృత్‌రాజ్‌ అభినందించారు. జిల్లా జట్టు వెంట హాకీ శిక్షకులు అనిల్‌, ఖాదర్‌బాషా, రవి, జానీ వెంట ఉన్నారు.


జిల్లా హాకీ జట్టు

ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లతో డిపో మేనేజర్‌

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీ కడప డిపో ఆధ్వర్యంలో ఆసక్తి గల వారికి డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కడప డిపో మేనేజర్‌ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ డ్రైవింగ్‌ స్కూలులో 13 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా, 14వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 16 మందిని అనుమతిస్తామని, 30 ఏళ్ల అనుభవం గల రీజినల్‌ సేఫ్టీ డ్రైవింగ్‌ ఇన్‌స్ట్రక్టర్‌ చేత థియరీ క్లాసులు, 30 ఏళ్ల పాటు డ్రైవింగ్‌లో అనుభవం గల డ్రైవింగ్‌ ఇన్‌స్ట్రక్టర్‌చే ప్రాక్టికల్‌ క్లాసులు ఉంటాయన్నారు. వాహనం విడిభాగాలతోపాటు సిగ్నల్‌ బోర్డులు, ఘాట్‌రోడ్డు ప్రయాణం, యూటర్న్‌లో డ్రైవింగ్‌ విధానంతోపాటు ఇతర అన్ని అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఔత్సాహిక డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 99592 25774, 73828 65145 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు


మృతి చెందిన నారాయణ

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే.. వీరపునాయునిపల్లె నుంచి జెర్రి నారాయణ(50), మాకం గంగన్న అనిమెలకు, అనిమెల నుంచి వీరపునాయునిపల్లెకు మాకం మంజునాథ వస్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న వీరి వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయాల పాలయ్యారు. వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జెర్రి నారాయణ(50) మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం మాకం గంగన్నను కడప రిమ్స్‌కు, మాకం మంజునాథను తిరుపతికి తీసుకెళ్లారు. వీరి ముగ్గురిదీ అనిమెల గ్రామం. నారాయణకు ముగ్గురు కుమార్తెలు కాగా వారిలో ఇద్దరికి వివాహం అయింది.

రిమ్స్‌లో గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



కడప అర్బన్‌ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్‌)లో చికిత్స పొందుతూ శనివారం గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. ఆమెకు సంబంధించి ఎవరైనా బంధువులు వుంటే తమను సంప్రదించాలని రిమ్స్‌ ఆర్‌ఎంఓ డాక్టర్‌ శ్రీనివాసులు తెలిపారు.

విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న కారు

త్రుటిలో తప్పిన ప్రమాదం


ఒరిగిన విద్యుత్‌ స్తంభం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లె-పందిళ్ళపల్లె మార్గమధ్యంలో మద్దిరేవుల గ్రామం మార్లవాండ్లపల్లెలో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్‌ స్తంభాన్ని కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి అపాయం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పందిళ్ళపల్లి నుంచి లక్కిరెడ్డిపల్లి వైపు వెళ్తున్న కారు మార్లవాండ్లపల్లె సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొంది. స్తంభం ఒరిగిపోవడంతో సమీపంలోని సబ్‌స్టేషన్‌ వారికి స్థానికులు ఫోన్‌ చేయడంతో సరఫరాను నిలిపివేశారు. విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి ఎటువంటి అపాయం జరుగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీనివాస గోవిందా.. శ్రీవేంకటేశ గోవిందా


బ్రహ్మరథంలో కొలువుదీరిన వేంకటరమణుడు


అశేష భక్తజనం మధ్య స్వామి వారి రథోత్సవం

పులివెందుల టౌన్‌ : స్థానిక వేంకటరమణుడి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటరమణుడు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం శ్రీవేంకటరమణుడు సతీమేతుడై బ్రహ్మరథంపై దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్‌ వైఎస్‌ మనోహర్‌రెడ్డి రథోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు మహాకుంబంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతోపాటు మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, సివిల్‌ సప్లయ్‌ రాష్ట్ర డైరెక్టర్‌ హాల్‌ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిషోర్‌, లక్ష్మీభార్గవి, కోఆప్షన్‌ చంద్రమౌళి తదితరులను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు శాలువతో సత్కరించి ఆశీర్వదించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాజులతోపాటు ఇతర అధికారులకు ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం వైఎస్‌ మనోహర్‌రెడ్డి రథానికి (తేరు) ఉన్న తాళ్లను పట్టుకొని ముందుకు కదిలించారు. రథోత్సవంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవేంకటరమణుడి ఆలయం వద్ద నుంచి మెయిన్‌బజార్‌, పూలంగళ్ల సర్కిల్‌, పాతగంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, ముత్యాల వీధి, శ్రీకృష్ణదేవరాయ నగర్‌, అమ్మవారిశాల మీదుగా స్వామివారి బ్రహ్మ రథోత్సవం జరిగింది. పోలీసులు పర్యవేక్షించారు. బ్రహ్మరథోత్సవం భక్తులు తమకు తోచిన విధంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. రథోత్సవం వెంబడి రామసేతు వేషధారణలో రాముడు, హనుమంతుల వేషధారణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.